

టన్ను చీనీ రూ.39,200

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.39,200, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.23,800 ధర పలికాయి.



కిలో టమాట రూ.28

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.28, కనిష్టంగా రూ.16, సరాసరిన రూ.23 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

32.7°/15.7°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పది'లో వందశాతం ఉత్తీర్ణతకు కృషి



నసనకోట పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ కిష్టప్ప

రామగిరి: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని డీఈఓ కిష్టప్ప పేర్కొన్నారు. రామగిరి మండలంలోని నసనకోట, కుంటిమద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వివరాలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలో బోధనా విధానం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి అండర్-16 త్రోబాల్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. గురువారం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో జిల్లా అండర్-16 బాల, బాలికల త్రోబాల్ క్రీడాకారుల ఎంపికను జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్ పాల్గొని ఎంపికను పర్యవేక్షించారు. బాలుర విభాగంలో సి.యశ్వర్ధన్, ఎం.దర్శన్, కే.ప్రభాస్ ఈశ్వర్, బాలికల విభాగంలో ఎస్.షిఫా అన్జుమ్, ఎన్.ప్రణీత, కే.భవ్యశ్రీ ఎంపికైనట్లు జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. వీరు ఈనెల 24న గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రమణ, పీడీ లోక్‌నాథ్, సీనియర్ క్రీడాకారుడు సలీమ్‌లు పాల్గొన్నారు.

సర్వేను వేగవంతం చేయండి

- కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలో ఎంఎస్ఎంఈల సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధితశాఖ అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగారాజుతో కలసి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మొబైల్ యాప్ ద్వారా ఎంఎస్ఎంఈల వివరాల నమోదు ప్రక్రియపై పలు సూచనలు చేశారు. డివిజన్‌స్థాయిలో ట్రేడ్ యూనియన్‌లతో సమావేశాలు నిర్వహించి సర్వేపై అవగాహన కల్పించాలన్నారు. పరిశ్రమలశాఖ, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు సమన్వయంతో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలన్నారు. సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన ఎనుములపల్లి విద్యార్థులతో ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు వేదికగా జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పుట్టపర్తి మండలం ఎనుములపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన సాయిస్వరూప, హర్షిత, నందిని రాణించి జట్టును ద్వితీయ స్థానంలో నిలిపారు. అలాగే బాలుర విభాగంలో సాయి చంద్ర ఒంటరి పోరు సాగిస్తూ జట్టును నాల్గో స్థానంలో నిలిపేలా చేశాడు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆ పాఠశాల హెచ్ఎం సుధాకర్, పీడీ రమేష్‌బాబు తదితరులు అభినందించారు.

ఉప్పెనలా ఊబకాయం



ధర్మవరానికి చెందిన 3వ తరగతి విద్యార్థి 46 కిలోల బరువు ఉన్నాడు. జంక్‌ఫుడ్ అతిగా తినడంతోనే బరువెక్కినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మిగతా విద్యార్థులతో సమానంగా క్రీడల్లో పాల్గొనలేకపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊబకాయం కారణంగా చలాకీతనం కోల్పోయాడని అంటున్నారు.

రెండు వారాల క్రితం తొమ్మిదో తరగతి చదివే ఓ విద్యార్థి బస్సులో ప్రయాణిస్తూ.. పుట్టపర్తి దాటిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. తోటి ప్రయాణికులు సాయం చేసి.. సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. షుగర్ లెవెల్స్ పడిపోయినట్లు నిర్ధారించారు. ఊబకాయమే సమస్యకు కారణమని వైద్యులు తేల్చారు.

> బొద్దుగా ఉంటే ముద్దుగా ఉన్నారంటారు. కానీ అధిక భారం అలాగే కొనసాగితే వారికి వారే భారం కావడం ఖాయం. అంతేకాదు పలు అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదమూ ఉంది. జీవనశైలిలో మార్పుల కారణంగా భవిష్యత్తులో ఊబకాయుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

- పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- లోపిస్తున్న మానసిక ఎదుగుదల
- బాల్యంలోనే బీపీ, షుగర్ ముప్పు
- విద్యలోనూ రాణించలేక ఇబ్బందులు

సాక్షి, పుట్టపర్తి: ఊబకాయం.. ప్రతి వందలో 20 మందిని తీవ్రంగా ఇబ్బంది పడుతున్న సమస్య. శారీరక వ్యాయామం తగ్గటం, ఆహార నియమాలు పాటించకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి విధానంతో ఇప్పుడు చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఊబకాయులుగా మారుస్తోంది. బాల్యంలోనే ఊబకాయం వస్తే చలాకీతనం కోల్పోతారు. చిన్న వయసులోనే అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. శారీరకంగా అనేక ఇబ్బందులు పడుతారు. వయసుకు తగిన బరువు ఉంటే చాలని.. అధిక బరువు అనర్థాలకు దారి తీస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఊబకాయుల్లో సమస్యలు ఇవే..

- ఊబకాయం ఉన్న పిల్లలు సహచరుల నుంచి తరచూ అవహేళనకు గురవుతారు. ఫలితంగా మానసికంగా డిప్రెషన్‌కు లోనయ్యే ప్రమాదం ఉంది.
- ఊబకాయం ఉన్న పిల్లలు చలాకీతనం కోల్పోవడం కారణంగా క్రీడల్లో రాణించలేరు. కనీసం అవకాశాలు రావడం కూడా కష్టమే.
- అందరితో పాటు వ్యాయామం చేయాలనుకున్నప్పటికీ.. కాసేపటికే అలసిపోతారు. శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడుతారు.
- మానసిక ఒత్తిడి కారణంగా చదువులో వెనుకబడే అవకాశం ఉంది. విద్యలో ఉన్నత స్థానాలకు వెళ్లడం కష్టమే.
- టీనేజీలోకి వచ్చేసరికి మరింత డిప్రెషన్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఫలితంగా అందరిలో కలవకుండా ఒక్కరే ఉండేందుకు ఇష్టపడతారు.
- ప్రీ డయాబెటిస్, హైపర్‌టెన్షన్ చిన్న వయసులోనే దరి చేరుతాయి. ఫలితంగా జీవితాంతం వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సిన పరిస్థితి.
- ఊబకాయం కారణంగా స్కిన్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ కూడా సోకే ప్రమాదం ఉంది.

ఇలా చేస్తే మేలు....



- జంక్‌ఫుడ్‌ను వీలైనంత వరకు తగ్గించాలి
- టీవీ, సెల్‌ఫోన్ చూసే సమయం తగ్గించాలి
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
- తల్లిదండ్రులు శ్రద్ధతో పిల్లలతో వాయింగ్ చేయించాలి
- ఊబకాయం ఉన్న పిల్లలను రెగ్యులర్‌గా హెల్త్ చెకప్ చేయించాలి

వ్యాయామం తప్పనిసరి

ఊబకాయం ఉన్న వారిలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉండవు. అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ కారణంగా ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వారంలో రెండు , మూడుసార్లు జంక్‌ఫుడ్ తింటే ఊబకాయం వచ్చే అవకాశం ఉంది. బయటి ఆహారం తినడమూ కారణంగా చెప్పవచ్చు. పిల్లల బరువు పెరుగుతున్నట్లు గుర్తిస్తే తల్లిదండ్రులు వారిని క్రమం తప్పకుండా వాకింగ్‌కు తీసుకెళ్లాలి. జంక్ ఫుడ్ బదులు ఆరోగ్యకర ఆహారం తీసుకునేలా చేయాలి.

– డాక్టర్ ప్రతాప్, హిందూపురం

జీవనశైలి మార్పులతో..

జంక్ ఫుడ్ బదులు ప్రత్యామ్నాయం ఆలోచించాలి. నిత్యం వ్యాయామం చేయలేని వారు ఇతర మార్గాల్లో శారీరక బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. అవతలి వ్యక్తి అవహేళన చేసినప్పుడు డిప్రెషన్‌కు లోను కాకూడదు. పిల్లల బరువు తగ్గే విషయంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. జీవన శైలిలో మార్పులతో ఊబకాయం నుంచి బయట పడవచ్చు.

– డాక్టర్ రాజశేఖర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్

ఊబకాయం ఇలా..



- జంక్‌ఫుడ్, బయట ఆహారం ఎక్కువగా తీసుకోవడం, పిజ్జా, బర్గర్, నూడిల్స్ తినడం కారణంగా ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంది.
- జంక్‌ఫుడ్ టేస్ట్ డిఫరెంట్‌గా ఉండటంతో ఎక్కువ మోతాదులో తీసుకుని బరువు పెరుగుతారని వైద్యులు చెబుతున్నారు.
- కదలిక లేని జీవన విధానంతో బరువు పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. బిజీ షెడ్యూల్‌లో చాలామంది నడవడం తగ్గించి వాహనాలను వినియోగిస్తున్నారు.
- టీవీ, సెల్‌ఫోన్ చూస్తూ.. మోతాదుకు మించి భోజనం తినేస్తున్నారు. ఫలితంగా మనిషి సాధారణం కంటే బరువు పెరిగే అవకాశం ఉంది.
- తల్లిదండ్రులు ఊబకాయులైనా పిల్లలకు వచ్చే అవకాశం ఉంటుందని పలు అధ్యయనాలు తేల్చాయి. జన్యుపరమైన కారణాల రీత్యా కూడా ఊబకాయం రావచ్చని అంటున్నారు.

డ్రోన్ కెమెరాలతో నేరాలు నియంత్రిస్తాం

- ఎస్పీ రత్న



పరేడ్ మైదానంలో డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ అధికారులకు డ్రోన్‌లు ఎలా వినియోగించాలి? అన్న అంశాలను వివరించి అనంతరం పరేడ్ మైదానంలో సిబ్బంది కలిసి డ్రోన్ల ఆపరేటింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి నేరాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చైన్ స్నాచింగ్స్, ఈవ్‌టీజింగ్, రహదారి ప్రమాదాలు, కోడి పందాలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాల్లోకి డ్రోన్ కెమెరాలను పంపి నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులు నియంత్రించేందుకు, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా ఉంచేందుకు డ్రోన్స్ వినియోగించుకుంటామన్నారు. డ్రోన్స్ ఎలా వినియోగించాలనే అంశాలపై పోలీస్ సిబ్బంది శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, వెంకటేశ్వర్లు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఆర్ఐలు వలి, మహేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కొనసా..గుతున్న పనులు

- రేపే సత్యసాయి బాబా జయంతి వేడుకలు



బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలకు అవసరమైన చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 23వ తేదీన జయంతి వేడుకలకు ట్రస్ట్ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నా... పారిశుధ్య పనులు, రోడ్డు నిర్మాణ పనులు, విద్యుత్ పనులు ఇంకా కొనసాగుతుండడంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు పుట్టపర్తికి చేరుకున్నారు. మరింత మంది వస్తున్నారు. డబ్బుకు కొదవ లేదని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రకటించినా సంబంధిత కాంట్రాక్టర్లు చేపట్టిన పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకూ సగం పనులు కూడా పూర్తికాకపోవడంతో భక్తులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా బ్రాహ్మణపల్లి రోడ్డు , పెద్ద కమ్మవారిపల్లి రోడ్డు, వెస్ట్ గేట్ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయలేదు. చిన్న గుంతలను పూడ్చినా పెద్ద గుంతలను అలాగే వదిలేశారని ప్రజలు వాపోతున్నారు. డివైడర్ల మధ్య , ప్రధాన రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించే పనులు ఇంకా పూర్తి కాలేదు. జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉన్నా.. పిలిపించుకోకపోవడంతో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని అంటున్నారు. ఇక విద్యుత్ పనులు కూడా పూర్తికాలేదని చెబుతున్నారు. చిత్రావతి నది పరిసరాల్లో కూడా పారిశుధ్య పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. అలాగే ఎనుములపల్లి ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న శిల్పారామం సమీపంలో ప్రధాన రోడ్డుపైకి మట్టి దిబ్బలు వచ్చినా నేటికీ తొలగించలేదు. ఇన్ని పనులు మరి ఎప్పుడు పూర్తి చేస్తారో చూడాలి.

విలువల విద్యాలయం

- ఆదర్శంగా నిలిచిన సత్యసాయి విద్యాసంస్థలు
- నేడు సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం
- 22 మందికి బంగారు పతకాలు
- 14 మందికి డాక్టరేట్లు, 480 మందికి పట్టాల పంపిణీ



సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ (ఫైల్)

ప్రశాంతి నిలయం: ప్రాచీన గురుకులు విద్యా విధానానికి మెరుగులు దిద్ది నేటి సమాజ అవసరాలకు అనుగుణంగా మానవతా విలువలు, భారతీయ సంస్కృతిని కలగలిపి తాను నెలకొల్పిన విద్యాసంస్థల ద్వారా చక్కటి విద్యాబోధనకు శ్రీకారం చుట్టారు సత్యసాయి. 1981 సంవత్సరంలో సత్యసాయి చాన్సలర్ హోదాలో సత్యసాయి యూనివర్సిటీని స్థాపించారు. నాటి నుంచి నేటి వరకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తోంది సత్యసాయి డీమ్డ్ టు బి యూనివర్సిటీ.

1986 శాశ్వత సభ్యత్వం

సత్యసాయి యూనివర్సిటీకి 1986లోనే అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్‌లో శాశ్వత సభ్యత్వం లభించింది. సత్యసాయి విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పాఠాలతో పాటు మానవతా విలువలు, భారతీయ సనాతన సంస్కృతిపై అవగాహన పెంపొందేలా విద్యను బోధిస్తున్నారు. సత్యసాయి డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రంలో కూడా క్యాంపస్‌లను నిర్వహిస్తోంది. ప్రశాంతి నిలయం క్యాంపస్‌తో పాటు అనంతపురంలో మహిళా క్యాంపస్ ఉంది. అలాగే ముద్దనహళ్లి, బృందావన్ క్యాంపస్‌లు కర్ణాటక రాష్ట్రంలో ఉన్నాయి. ఈ క్యాంపస్‌ల ద్వారా ఏడు విభాగాల్లో అండర్ గ్యాడ్యుయేషన్ (యూజీ), ఐదు విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ), మూడు ప్రొఫెషనల్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దేశంలోనే అత్యున్నత నాణ్యతా ప్రమాణలతో నడుపుతున్న యూనివర్సిటీగా కొనసాగుతున్న సత్యసాయి యూనివర్సిటీకి 2002లో నేషనల్ అసోసియేషన్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(న్యాక్) ఏ++ గ్రేడును కేటాయిస్తూ జాతీయస్థాయి అత్యున్నత విద్యాసంస్థగా గుర్తించింది. ఆ తర్వాత 2008లో సత్యసాయి డీమ్డ్ టు బి యూనివర్సిటీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీగా రూపాంతరం చెందింది. సత్యసాయి విద్యాసంస్థల ద్వారా పరిశోధనా రంగాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పరిశోధనా కేంద్రాన్ని స్థాపించారు. దేశంలోని అత్యున్నత వేదికలపై సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు అన్ని రంగాల్లో సత్తాచాటుతున్నారు. దేశ వ్యాప్తంగా సత్యసాయి యూనివర్సిటీకి అనుబంధంగా 99 విద్యాసంస్థలు పేద విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్నాయి.

స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రశాంతి నిలయంలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో సత్యసాయి యూనివర్సిటీ 43వ స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఉదయం 9.50 గంటలకు స్నాతకోత్సవ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 10.03 నిమిషాలకు సత్యసాయి విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయి. 10.06 నిమిషాలకు ఫౌండర్ చాన్సలర్ సత్యసాయి డిజిటల్ స్క్రీన్ ద్వారా స్నాతకోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రకటిస్తారు. 10.08కి వైస్ చాన్సలర్ ప్రారంభోపన్యాసం చేస్తారు. 10.32 గంటలకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తారు. 10.35కు ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు, పీహెచ్‌డీలు, పట్టాలను ముఖ్య అతిథి చేతులు మీదుగా పంపిణీ చేస్తారు. తర్వాత విద్యార్థులనుద్దేశించి స్నాతకోత్సవ సందేశాన్నిస్తారు. సత్యసాయి పూర్వపు ప్రసంగాలను డిజిటల్ స్క్రీన్‌లపై ప్రదర్శిస్తారు. 11.54 గంటలకు చాన్సలర్ స్నాతకోత్సవాన్ని ముగిస్తారు. సత్యసాయి విద్యాసంస్థల్లోని వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన 22 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, 14 మందికి పరిశోధనా విద్యార్థులకు డాక్టరేట్లు, 480 మందికి పట్టాలను ముఖ్య అతిథి చేతుల మీదుగా పంపిణీ చేస్తారు. వేడుకలకు ముఖ్య అతిథి యూఎస్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ సేతురామన్ పంచనాథన్ హాజరు కానున్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరీ



భక్తిగీతాలు ఆలపిస్తున్న యువత



వయోలిన్, పియానోతో అలరించిన అలెగ్జాండ్రా, లిడియా

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత సత్యసాయి సేవా ఆర్గనైజేషన్స్‌కు చెందిన యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. 'ఎస్ఎస్ఎస్ఓ – ది రాయల్ పాత్ టూ ట్రాన్స్‌ఫర్మేషన్' పేరుతో చక్కటి ప్రదర్శన నిర్వహించారు. మానవతా విలువలు, ఆధ్యాత్మికత, సత్యసాయి బోధనలు అన్న అంశాలపై దేశవ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో 5,517 విద్యాసంస్థలకు చెందిన 2,72,300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వ్యాసరచన పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన 20 మంది బాలికలు, ఐదుగురు బాలురకు బంగారు పతకాలు , సర్టిఫికెట్లను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ నిమిష్ పాండ్యా అందజేశారు. అనంతరం మాల్దోవాకు చెందిన వయోలిన్ పియానో వాయిద్య కళాకారిణులు అలెగ్జాండ్రా, లిడియా ఇచ్చిన ప్రదర్శ అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: సత్యసాయి 99వ జయంతి వేడుకలకు ముఖ్య అతిథి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఈ నెల 22న ఆయన పుట్టపర్తికి విచ్చేయనున్నారు. గవర్నర్ పర్యటించే స్థలాలను, ఆయన బస చేసే ప్రాంతాలను కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న గురువారం పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో, సాయి శ్రీనివాస గెస్ట్ హౌస్, ప్రశాంతి నిలయంలో కాన్వాయ్ నిర్వహణ, పుట్టపర్తి పట్టణంలో పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణకు చేట్టాల్సిన చర్యలపై చర్చించారు. గవర్నర్ పర్యటనలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

షెడ్యూల్ ఇలా..

ఈ నెల 22న గవర్నర్ విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 11 గంటలకు బయలు దేరి బెంగళూరు చేరుకుంటారు. రాత్రి 8 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి రాత్రి 10 గంటలకు కోడికొండ చెక్ పోస్ట్ వద్ద ఉన్న రక్షా అకాడమికి చేరుకుంటారు. అక్కడ కొంత సేపు విశ్రాంతి తీసుకుని అక్కడి నుంచి బయలు దేరి రాత్రి 11 గంటలకు పుట్టపర్తిలోని సాయి శ్రీనివాస గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. 23న ఉదయం 9 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకొని సత్యసాయి మహా సమాధిని దర్శించుకుంటారు. తర్వాత జయంతి వేడుకల్లో పాల్గొంటారని కలెక్టర్ చేతన్ తెలిపారు. అనంతరం ఉదయం 11.05 నిమిషాల నుంచి 11.20 వరకూ సాయి శ్రీనివాస అతిథి గృహంలో విశ్రాంతి తీసుకుంటారు. తిరిగి రోడ్డు మార్గంలో బయలు దేరి 12.20 నిమిషాలకు రక్షా అకాడమికి చేరుకుంటారు. అక్కడి నుంచి 12.35 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి బెంగళూరు చేరుకుంటారన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

తనకల్లు: మండలంలోని ఏనుగుగుండు తండాలో అక్రమంగా విక్రయిస్తున్న 40 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మారుతీరావు తెలిపారు. అందిన సమాచారం మేరకు గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బీసీసీఐ అండర్-15 టోర్నీలో మెరిసిన జిల్లా అమ్మాయిలు



చక్రిక



తేజస్విణి

అనంతపురం: మహారాష్ట్రలో జరుగుతున్న అండర్ 15 బీసీసీఐ ఉమెన్ క్రికెట్ టోర్నీలో జిల్లాకు చెందిన అమ్మాయిలు మెరిశారు. గురువారం ఆంధ్ర, మహారాష్ట్ర జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో జిల్లాకు చెందిన చక్రిక మూడు వికెట్లు సాధించి సత్తా చాటింది. ఫలితంగా ఆంధ్రప్రదేశ్ జట్టు గెలుపులో కీలకంగా మారింది. 35 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 193 పరుగులు సాధించిన ఆంధ్ర జట్టులో బ్యాటర్లు దీక్ష 52 పరుగులు, పుష్పిత 42 పరుగులతో మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. అనంతరం మహారాష్ట్ర జట్టు పది వికెట్ల నష్టానికి కేవలం 111 పరుగులు మాత్రమే చేసింది. ఎడమచేతి లెగ్ స్పిన్నర్ డి.చక్రిక ధాటికి మహారాష్ట్ర బ్యాటర్లు కంగుతిన్నారు. ఈ మ్యాచ్‌లో ఆమె మూడు వికెట్లు తీసింది. మరో బౌలర్ బి.తేజస్విణి (కుడి చేతి పేసర్) రెండు వికెట్లు తీసి ప్రతిభ చాటింది.

ముత్యాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

రామగిరి: మండలంలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. నాలుగు నెలల 17 రోజులకు గానూ రూ.13,15,634 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

అద్దె గూళ్లు.. అంగన్‌వాడీ కేంద్రాలు

- 34 కేంద్రాలకు లేని సొంత భవనాలు
- చిన్నారులకు ఆట స్థలం కరువు
- త్వరగా పూర్తి చేయాలంటున్న లబ్ధిదారులు



రెండేళ్ల క్రితం కూల్చివేసిన పెదపల్లి కేంద్రం



8 ఏళ్ల క్రితం ఆగిన దిగువచెర్లోపల్లి అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలను నిర్మించడంలో అంతులేని నిర్లక్ష్యం కనబడుతోంది. శిథిలావస్థకు చేరుకున్న కేంద్రాలకు సైతం మరమ్మతులు చేపట్టడం లేదు. దీనికి తోడు చేపట్టిన నిర్మాణాలను అర్ధంతరంగా వదిలేయడంతో మొండిగోడలు దర్శనమిస్తున్నాయి.

నేటికీ అద్దె భవనాల్లోనే

పుట్టపర్తి మండలంలో 66 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 32 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మిగిలిన వాటిలో 16 ప్రభుత్వ భవనాల్లో, 18 కేంద్రాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇవన్నీ అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటైనప్పటి నుంచి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆయాకేంద్రాల్లో సరైన ఆట స్థలం లేక చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ప్రాంతాన్ని బట్టి ఒక్కో భవనానికి రూ.వెయ్యి నుంచి రూ.5వేల వరకూ అద్దె చెల్లిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటి వరకూ భవన యజమానులకు అద్దె రూపంలో చెల్లించిన మొత్తంతోనే నూతన కేంద్రాలను నిర్మించవచ్చుననే వాదనలు వినవస్తున్నాయి. ఉన్న వాటిలోనూ కొన్ని నిర్వహణ లోపంతో పాడుబడ్డాయి. పైకప్పులపై చెత్తాచెదారం పేరుకు పోయి వర్షాలకు కారుతున్నాయి. దీంతో త్వరగా శిథిలావస్థకు చేరుకుంటున్న ఆయా కేంద్రాలకు చిన్నారులను పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు.

శిథిలావస్థలో నాలుగు భవనాలు

జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రత్యేక నిధులను కేటాయించడం లేదని తెలుస్తోంది. ఈ క్రమంలోనే పాక్షికంగా దెబ్బ తిన్న భవనాలకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో అవి కాస్త శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండలంలోని పెదపల్లి పెద్ద తండా, నిడిమామిడి కేంద్రాలే ఇందుకు నిదర్శనం. పెదపల్లి-1 కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండేళ్ల క్రితం కూల్చి వేశారు. ఆ స్థలంలో నూతన భవన నిర్మాణంపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో సదరు కేంద్రాన్ని పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. దిగువచెర్లోపల్లి గ్రామంలో 8 ఏళ్ల క్రితం గోడల వరకూ నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం ఆ గోడలు సైతం బీటలు వారాయి. పునాదిలోనూ పగుళ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో ఈ భవన నిర్మాణానికి రూ.7 లక్షల నిధులు కేటాయించగా రూ.2.8 లక్షలు వెచ్చించి పనులు ఆపేశారు. తాజాగా రూ.3 లక్షల నిధులు మంజూరైనా ప్రస్తుత నిర్మాణ వ్యయం పెరగడంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.



శిథిలావస్థకు చేరిన నిడిమామిడి కేంద్రం

ఇబ్బందిగా ఉంది

మా గ్రామంలో చాలా కాలం ఏళ్ల క్రితం అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం వర్షాలకు ఈ భవనం పైకప్పు కారుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి కూలుతుందేమోనని భయపడ్డాం. అద్దె గదుల్లోకి మారుద్దామంటే గ్రామంలో ఎక్కడేగాని ఖాళీ ఇల్లు లేదు. కొత్త భవనాన్ని నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారుల ఇక్కట్లను తీర్చాలని అడుగుతున్నాం.

– శంకరావతి, అంగన్‌వాడీ కార్యకర్త, నిడిమామిడి

నిధులు మంజూరు కాలేదు

శిథిలావస్థకు చేరిన నిడిమామిడి, పెడపల్లి పెద్దతండా, పెడపల్లి-1 కేంద్రాలకు కొత్త భవన నిర్మాణాలకు సంబంధించి ఇప్పటి వరకూ నిధులు మంజూరు కాలేదు. దిగువచెర్లోపల్లి కేంద్రానికి రూ.3 లక్షలు మంజూరైంది. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– శశికుమార్, పంచాయతీ రాజ్ ఏఈ, పుట్టపర్తి

34 కేంద్రాలకు సొంత భవనాలు లేవు

పుట్టపర్తి మండలంలోని 34 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. ఇందులో 18 కేంద్రాలకు ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నాం. గ్రామసభల్లో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతి పత్రాలు ఇస్తూనే ఉన్నారు.

– భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పుట్టపర్తి

కబడ్డీ క్రీడాకారుడి దుర్మరణం



నవీన్‌బాబు (ఫైల్)

పావగడ: కారు పల్లంలోకి పల్టీలు కొట్టిన ఘటనలో కబడ్డీ క్రీడాకారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా వెంకటాపురం గ్రామానికి చెందిన నవీన్‌బాబు (22) రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టులో కీలక క్రీడాకారుడిగా ఖ్యాతిగాంచాడు. శిర తాలూకా లోని బుక్కపట్న గ్రామంలో తన స్నేహితుడి ఇంట బుధవారం సాయంత్రం జరిగిన ఓ విందుకు ఐదుగురు స్నేహితులతో కలసి నవీన్‌బాబు హాజరయ్యాడు. రాత్రి కారులో తిరుగు ప్రయాణమైన వారు జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన లారీని తప్పించబోయి అదుపు తప్పి మోరీని ఢీకొన్నారు. ఘటనలో కారు పల్టీలు కొడుతూ పల్లంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో వెనుక తలుపు డోర్ విరిగిపోవడంతో పక్కనే కూర్చొన్న నవీన్‌బాబు బయటపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వెళుతున్న వారు ప్రమాదాన్ని గుర్తించి వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను తుమకూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం నవీన్‌బాబు మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి చేర్చారు. ఒక్కగానొక్క కుమారుడి ఆకస్మిక మృతిని తట్టుకోలేక తల్లితండ్రులు ప్రకాష్, సుజాతమ్మ గుండెలవిసేలా రోదించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వెంకటేష్, గ్రామస్తులు... నవీన్‌బాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్



కల్లు దుకాణంలో నమూనాలు సేకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

హిందూపురం అర్బన్: అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కర్ణాటక మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయన్న సమాచారంతో అప్రమత్తమై బుధ, గురువారాల్లో వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. గౌర్రిపల్లి గేట్ వద్ద యూసూప్ నుంచి 40 టెట్రా పాకెట్లు, పులమతి క్రాస్ వద్ద చంద్రప్ప నుంచి 30 హైవార్డ్స్ బాటిళ్లు, ముదిరెడ్డిపల్లిలో గంగాధరప్ప నుంచి 10 బ్రాందీ బాటిళ్లు, హిందూపురంలో మంజుల నుంచి 20 హైవార్డ్ బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు హిందూపురం మండలం కిరికెర కల్లు సొసైటీ పరిధిలోని హనుమంతు కల్లు దుకాణం, సంతేబిదనూరులో శ్రీనివాసులు కల్లు దుకాణంలో కల్లు శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడి మృతి



శివకుమార్ (ఫైల్‌ఫోటో)

పరిగి: మండల కేంద్రంలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్న శివకుమార్(29) గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. లేపాక్షి మండలం చోళసముద్రం గ్రామానికి చెందిన ఆయన పరిగిలోని ఇండియన్ ఎక్స్‌పోర్టు డిజైన్స్ గార్మెంట్స్ వస్త్ర పరిశ్రమలో దుస్తులను ఇస్త్రీ చేసే విభాగంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం విధులకు హాజరైన శివకుమార్ వస్త్రాలను ఇస్త్రీ చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే శివకుమార్ మృతి చెందాడంటూ ప్రజా సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. హిందూపురంలోని ప్రభుత్వాసుపత్రిలో శివకుమార్ మృతదేహాన్ని సందర్శించిన అనంతరం ఏఐటీయూసీ, జైభీం భారత్, ఎంఎస్ఎఫ్ నేతలు వినోద్‌కుమార్, ఊటుకూరు నాగరాజు, రవి మాట్లాడారు. మృతుడి కుటుంబసభ్యులకు రూ.20 లక్షల పరిహారాన్ని చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

ఏప్రిల్‌లో వైద్య కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 2025, ఏప్రిల్ రెండో వారంలో సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు తెలిపారు. వేడుకల నిర్వహణపై సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ కమిటీ సభ్యులతో గురువారం వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సంఘం సభ్యులు సమావేశమై చర్చించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ వేడుకలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రముఖులు, క్రీడ, వైద్య ప్రముఖులను ఆహ్వానించనున్నట్లు తెలిపారు. మూడ్రోజుల పాటు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్య పూర్తి చేసుకున్న వైద్య విద్యార్థులు అందరూ తప్పనిసరిగా పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యత్వం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యత్వం కోసం రూ.5వేలను కనీస రుసుముగా నిర్ణయించారు. సమావేశంలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ చైతన్య, డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రీహర్ష, సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ దుర్గ, డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ వేముల శ్రీనివాసులు, డాక్టర్ శైలజ, డాక్టర్ స్వాతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

• హవళిగి.. భక్తజన లోగిలి



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

విడపనకల్లు: మండలంలోని హవళిగి గ్రామం గురువారం భక్తజన లోగిలిగా మారింది. కడ్లే గౌరమ్మ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రత్యేకంగా పూలతో ఎద్దుల బండిపై అలంకరించిన రథంపై కడ్లే గౌరమ్మను ప్రతిమను ఉంచి తెల్లవారుజామున గ్రామంలో ఊరేగించారు. జిల్లాలోని వివిధ మండలాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి భక్తులు తరలిరావడంతో వీధులన్నీ జనసంద్రమయ్యాయి. రథోత్సవం ముందు 101 కలశాలతో బాలికలు, మహిళలు హారతులు పట్టారు. వివిధ రకాల వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు.

ఫలసాయంలో ‘పండు ఈగ’

- రైతులు జాగ్రత్తలు పాటించకపోతే నష్టాలు అధికం
- అవగాహన సదస్సులో ఎన్‌పీహెచ్‌ఎం, ‘అపెడా’ ప్రతినిధులు



సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల పండ్ల తోటల్లో పండు ఈగ (ఫ్రూట్ ఫ్లై) ప్రధాన సమస్యగా మారిందని, దీని వల్ల రైతులకు నష్టం వాటిల్లుతున్నట్లు నేషనల్ పెస్ట్ సర్వైవలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) గుర్తించినట్లు జాతీయ మొక్కల యాజమాన్య సంస్థ (ఎన్‌పీహెచ్‌ఎం), అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా) ప్రతినిధులు తెలిపారు. పండు ఈగ అంశంపై గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఉమ్మడి జిల్లా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, రెండు జిల్లాల ఉద్యానశాఖ అధికారులు బీఎంవీ నరసింహారావు, జి.చంద్రశేఖర్, టెక్నికల్ హెచ్ఓ పల్లవితో పాటు ఎన్‌పీహెచ్‌ఎం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్యాలజ్యోతి, అపెడా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు. గతంలో కేవలం మామిడిలో మాత్రమే కనిపించే పండు ఈగ ఇటీవల వాతావరణ మార్పులు, విచ్చలవిడిగా రసాయన మందులు వాడకం, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం లాంటి కారణాలతో జామ, చీనీ, సీతాఫలం, దానిమ్మ లాంటి పండ్ల తోటలతో పాటు బీర లాంటి కూరగాయల పంటలోనూ ఎక్కువగా ఆశించి నష్టం కలుగుజేస్తోందన్నారు. ఈ నష్టంపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన పంటలు చేతికొచ్చే సమయంలో పండు ఈగ ఆశిస్తే దిగుబడులు తగ్గి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీని నివారణకు పండు ఈగ ఎరలు, మిథైల్ యూజినాల్ ఎరలు ఎకరాకు 6 నుంచి 8 వరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తోటలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. 1.5 గ్రాముల అసిఫేట్ లేదా 1 గ్రాము డెల్టామైత్రీన్ లేదా పిప్రోనిల్ లాంటి మందుల పిచికారీతో నివారించుకోవాలని సూచించారు. ఎరలు ఏర్పాటు చేసి పురుగు ఉనికి ఉధృతిని బట్టి మేలైన సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

జీవాల సంరక్షణ చర్యలు చేపట్టండి

- పశుశాఖ జేడీ, ఏడీడీఎల్ ఏడీ సూచన



అనంతపురం అగ్రికల్చర్: చలికాలంలో జీవాలకు సంక్రమించే జబ్బులు, వాటి సంరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెంపకందారులకు పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామి, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం (ఏడీడీఎల్) ఏడీ డాక్టర్ ఎన్.రామచంద్ర సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలు, రాత్రి, ఉదయం పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్న నేపథ్యంలో గొర్రెలు మేకలు, వాటి పిల్లలకు వ్యాధులు సంక్రమించకుండా తీసుకోవాల్సిన చర్యలను వారు వివరించారు.

- చలిని తట్టుకునే శక్తి వచ్చే వరకూ తల్లి గొర్రె నుంచి పాలు అందేలా గొర్రె పిల్లలను చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల గొర్రె పిల్లల్లో ఎదుగుదల, వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. చిన్నవాటికి చలిగాలులు తగలకుండా, శరీర ఉష్ణోగ్రత తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- జీవాలు ఉండే ప్రాంతాల్లో భూమిలో తేమశాతం లేకుండా ఉండాలి. పొడి వాతావరణం, ఎత్తైన ప్రదేశాలను ఎంచుకోవాలి. లేదంటే తేమ వల్ల పరాన్నజీవులు, సూక్ష్మజీవుల బెడద ఎక్కువై వ్యాధులు ప్రబలి మరణాలు సంభవిస్తాయి.
- గొర్రె, మేక పిల్లలు మట్టిని నాకకుండా చూసుకోవాలి. లేకుంటే పారుడురోగం లాంటి వ్యాధులు సోకుతాయి. ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్) కలిగిన ఇటుకలను పిల్లల గూళ్లలో వేలాడదీయాలి. పిల్లలను ఎక్కువ సంఖ్యలో ఉంచితే ఒత్తిడి నెలకొంటోంది కాబట్టి విశాలంగా, శుభ్రంగా గాలి వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలి. రాత్రిళ్లు వెచ్చదనం ఉండేలా లైట్లను లేదంటే అడ్డుతెరలు ఏర్పాటు చేయాలి.
- చలికాలంలో ఈగలు, దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. పరిసరాల పరిశుభ్రత పాటించాలి. గోమార్ల నివారణ చర్యలు చేపట్టాలి. చిన్న పిల్లలను బయట ప్రదేశాల్లో ఉంచితే దోమతెరలు వాడాలి. చిన్నపాటి షెడ్లలో పట్టలు కప్పి అందులో పెంచడం ఉత్తమం.
- జబ్బులు వ్యాపిస్తే మందలోని పిల్లలను వేరు చేయాలి. పిల్లలన్నింటికీ ఎంసీ-ఈటీ టీకాను వేయించాలి. యాంటీబయోటిక్స్, బీ-కాంప్లెక్స్, లివర్ టానిక్‌లు, ఈస్ట్ కల్చర్‌లు, జీర్ణక్రియ మందులు, ఐరన్, క్యాల్షియం తదితర మందులు పశువైద్యుని సూచన మేరకు వాడాలి.
- ఇప్పటికే ముందస్తు జాగ్రత్త కింద 8.03 లక్షల జీవాలకు మూతిపుండ్ల, నీలినాలుక వ్యాధి (బ్లూటంగ్) టీకాలు ఉచితంగా వేశారు. ఈ వ్యాధి సోకితే ఎక్కువగా జ్వరం, మూతివాపు, నోటిలో పుండ్లు, పెదవులు దద్దరించడం, ముక్కు నుంచి చీమిడి కారడం లాంటి లక్షణాలు ఉంటాయి. నివారణ చర్యలు చేపట్టకపోతే 30 శాతం వరకు మరణాలు ఉంటాయి. సాయంత్రం పూట గొర్రెల మందలో వేపాకు పొగ వేయడం, అపుడపుడు బ్యూటాక్స్ లేదా టిక్కెల్ లాంటి మందులు పిచికారీ చేయడం, పొడి ప్రాంతాల్లో మేపుకోవాలి. పశువైద్యున్ని సూచన మేరకు నివారణ చర్యలు చేపట్టాలి.
- కాలిగిట్టల మధ్య చీము చేరి చెడు వాసన రావడం, కుంటడం లాంటి లక్షణాలు ఉంటే కాలిపుండ్ల వ్యాధి (ఫుట్‌రాట్)గా గుర్తించి బురద ప్రాంతాల్లో మేపకుండా చూడాలి. నట్టల మందు తాపించాలి. కాలిపుండ్లు బాగా కడిగి పసుపు లేదా ఆయిట్‌మెంట్ రాసి మట్టి తగలకుండా రెండు రోజులు యాంటీబయాటిక్స్ ఇవ్వాలి.

యువకుడి ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

సోమందేపల్లి: స్థానిక వినాయక్ నగర్‌కు చెందిన నవీన్‌కుమార్ (34) ఆత్మహత్య చేసుకున్నాడు. సోమందేపల్లి మండలం గుడిపల్లికి చెందిన ఆయన గత రెండేళ్లుగా స్నేహలత నగర్ వద్ద ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం తన దుకాణంలోనే ఆయన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

రైతు బలవన్మరణం



సుధాకరరెడ్డి (ఫైల్)

పెనుకొండ రూరల్: జీవితంపై విరక్తితో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం మావటూరు గ్రామానికి చెందిన సుధాకరరెడ్డి(38)కి భార్య హేమలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తనకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఇటీవల భూ సమస్య నెలకొనడంతో తీవ్ర మనోవేదనకు లోనైన ఆయన పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగాడు. అయినా ఫలితం దక్కక పోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారుజామున తన ఇంటి ఎదురుగా ఉన్న పశువుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా - ఒకరి మృతి



ఓబుళమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్: ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం పట్టణానికి చెందిన వివాహిత ఓబుళమ్మ (45), మరికొందరు మహిళలతో కలసి గురువారం ఉదయం ఆటోలో పెనుకొండకు బయలుదేరారు. పెనుకొండ సమీపంలోని తిమ్మాపురం ధాబా వద్దకు చేరుకోగానే ఆటో ముందు చక్రం ఊడి అదుపు తప్పి పక్కనే గోతిలోకి దూసుకెళ్లింది. ఘటనలో ఓబుళమ్మ మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్, పుష్పలత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఘటనపై కియా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఓబుళమ్మకు భర్త గంగన్న, ఓ కుమార్తె ఉన్నారు.

24న బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

అనంతపురం: జిల్లా మహిళలు, పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక ప్రక్రియ ఈ నెల 24 ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బాస్కెట్‌బాల్ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ కేఎం హబీబుల్లా, జనరల్ సెక్రటరీ కే. నరేంద్ర చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 6 నుంచి 9వ తేదీ వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్తేరులో జరగనున్న ఏపీ సీనియర్ అంతర్ జిల్లా బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జట్టు ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు.

చిరుత దాడిలో గొర్రెల మృతి

కుందుర్పి: చిరుత దాడిలో రెండు గొర్రెలు మృతి చెందాయి. కుందుర్పి మండలం కెంచంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఈరన్న గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో పాకలోకి చిరుత చొరబడడంతో గొర్రెలు బెంబేలెత్తి గట్టిగా అరవసాగాయి. దీంతో అప్రమత్తమైన ఈరన్న గట్టిగా కేకలు వేస్తూ పాక వద్దకు చేరుకుంటుండగా ఓ చిరుత సమీపంలోని పొదల్లోకి పరుగు తీసింది. పాకలోకి వెళ్లి పరిశీలిస్తే మృతి చెందిన రెండు గొర్రెలు కనిపించాయి. ఘటనతో రూ.25వేల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు. కాగా, రెండు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన రామాంజినేయులు పెంచుకున్న గేదెను చిరుత చంపి తినేసింది.